క్లుప్తంగా

విద్యార్థినికి ఎంఈఓ అభినందన

సింగరేణి(కొత్తగూడెం): వ్యర్థం నుంచి కళాకృత వస్తువుల తయారీ జిల్లా స్థాయి పోటీలలో ద్వితీయ బహుమతి పొందిన రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని హరితను మంగళవారం మండల విద్యాధికారి డాక్టర్ ఎం.ప్రభుదయాళ్ అభినందించారు. మాట్లాడుతూ.. హరిత తయారుచేసిన పాత చీరతో డోర్ మ్యాట్ తయారీ విధానం బాగుందని, ఇలాంటి వాటివల్ల భవిష్యత్‌లో కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చన్నారు. విద్యార్థులు ఇలాంటి మరిన్ని ఆవిష్కరణల గురించి ఆలోచించాలన్నారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోండి



రైతు నేస్తంలో పాల్గొన్న అధికారులు

సుజాతనగర్: రైతులకు చేదోడువాదోడుగా ఉండేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావు అన్నారు. మంగళవారం స్థానిక రైతువేదికలో ప్రభుత్వం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులలో రైతులు క్షేత్రస్థాయిలో చర్చలు జరపవచ్చన్నారు. గ్రామాల నుంచే రైతులు తమ పంటలకు కావాల్సిన సలహాలు, సూచనలు అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహ రావు, ఏఓ నర్మద తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి

జూలూరుపాడు: పాపకొల్లు నుంచి కారేపల్లి మండలం చీమలపాడు గ్రామాలను కలుపుతూ బీటీ రోడ్డు నిర్మించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ జన సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన కాకర్ల, అనంతారం, పడమటనర్సాపురం, జూలూరుపాడు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జూలూరుపాడులో మాట్లాడారు.

ప్రతీ రైతు ఇన్సూరెన్స్ చేసుకోవాలి



మాట్లాడుతున్న వీరహనుమంతరావు

కొత్తగూడెంరూరల్: ప్రతీ రైతు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో ఇన్సూరెన్స్ చేసుకోవాలని కొత్తగూడెం సహకార సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం, హేమచంద్రాపురం గ్రామాల్లో మంగళవారం నాబార్డు సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడారు. రైతులకు అవసరమైన అన్ని రకాల రుణాలను డీసీసీబీ తక్కువ వడ్డీకి ఇస్తుందన్నారు. బంగారంపై రుణాలు తీసుకునే అవకాశం కూడా ఉందని చెప్పారు. డిపాజిట్‌పై అధిక వడ్డీ రేట్లు ఇస్తుందన్నారు. రైతులు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ ఇ.శాంతి రాగమయి, సొసైటీ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, ఎఫ్ఎల్‌సీ అశోక్, సెక్రటరీ పండ్ల సారయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆర్వోబీపై అంధకారం



బ్రిడ్జిపై చిమ్మచీకటి

సుజాతనగర్: కొత్తగూడెం, ఖమ్మం ప్రధాన రహదారిలోని వంతెనపై లైట్లు లేక రాత్రిపూట అంధకారం అలుముకుంటోంది. సత్తుపల్లి, భద్రాచలం రైల్వేలైన్‌లో భాగంగా స్థానిక గాయత్రీనగర్ వద్ద ఆర్వోబీని ఏర్పాటు చేశారు. ఇందుకోసం సుమారు రూ.45 కోట్లు వెచ్చించారు. ఇటీవల బ్రిడ్జి పైనుంచి రాకపోకలు కొనసాగుతున్నాయి. వంతెనపై రెండు వైపులా ఏర్పాటు చేసిన లైట్లను ప్రారంభించకపోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. రాష్ట్రీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ మార్గంలో వెళ్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. వంతెనపై లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆర్వోబీపై ఏర్పాటు చేసిన లైట్లను ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పల్లెల్లో పశువులకు అందని వైద్యం

- ఏడేళ్లుగా నాగారం, యానంబైల్ ఆస్పత్రులకు పశువైద్యాధికారి కరువు
- కాంట్రాక్ట్ అటెండరే దిక్కు
- చుట్టపుచూపుగా వచ్చిపోతున్న ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి
- రెగ్యులర్ పశువైద్యుడిని నియమించాలని రైతుల వేడుకోలు



నాగారం ప్రభుత్వ పశువైద్యశాల

పాల్వంచరూరల్: మూగజీవాలకు జబ్బు చేస్తే మరణమే శరణ్యంగా మారింది. పశువైద్యాధికారి లేక పల్లెల్లో పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. నాగారం గ్రామంలోని పశువైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడేళ్లుగా ఇన్‌చార్జ్ డాక్టర్ ఉన్నారు. ఈయన కూడా చుట్టపు చూపుగా వచ్చిపోవడంతో ఆస్పత్రి పరిధిలోని గ్రామాల్లో పశువులకు జబ్బు చేస్తే వైద్యం చేసే దిక్కు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం కాంట్రాక్ట్ అటెండర్ మాత్రమే ఉన్నారు. ఇన్‌చార్జ్ డాక్టర్ బాలకృష్ణ సారపాకలో నివాసం ఉంటారు. ఆయనకు నాగారం ఇన్‌చార్జ్ బాధ్యతలతోపాటు చర్ల, దుమ్ముగూడెం, సత్యనారాయణపురం, యానంబైల్, బంజర, ఆస్పత్రులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించడంతో నాగారం ఆస్పత్రికి సక్రమంగా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో రెగ్యులర్ పశువైద్యాధికారి అశోక్ ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లిన తర్వాత ఆస్పత్రికి పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉంది. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పశువులకు జబ్బు చేస్తే పాల్వంచకు వెళ్లాల్సిందే...

నాగారం గ్రామపంచాయతీ పరిధిలో రేపల్లెవాడ, బోజ్యాతండా, జగన్నాథపురం, రంగాపురం, నాగారంకాలనీ, తోగ్గూడెం, తోగ్గూడెంతండా, నారాయణరావుపేట గ్రామాల పరిధిలో ఐదువేలకు పైగా గేదెలు, నాలుగు వేలకు పైగా ఆవులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయి. వాటికి ఏదైనా జబ్బు చేస్తే రైతులు వైద్యం చేయించడానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాల్వంచలోని పశువైద్యశాలకు తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు పలు రకాల వైరస్ వ్యాధుల సోకి అల్లాడుతుంటే నివారణకు ముందస్తుగా టీకాలు వేయాల్సి ఉండగా పశువైద్యాధికారి, సిబ్బంది లేక పల్లెల్లో క్యాంపులు నిర్వహించి టీకాలు వేసే పరిస్థితి లేదు. పశువులకు గాలికుంటు వ్యాధులు సోకినా పట్టించుకునే దిక్కు లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యానంబైల్‌లోనూ డాక్టర్ పోస్టు ఖాళీ...

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన యానంబైల్ గ్రామంలో కూడా పశువువైద్యశాలకు రెగ్యులర్ డాక్టర్ లేడు. నాగారం ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ బాలకృష్ణకే యానంబైల్ ఆస్పత్రికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఈ డాక్టర్ యానంబైల్ ఆస్పత్రికి ఎన్నడూ వెళ్లింది కూడా లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



నాగారం ఆస్పత్రిలో ఏడేళ్లుగా పశువైద్యాధికారి లేకపోవడంతో పశువులకు వ్యాధులు సోకితే ఇబ్బందులు పడుతున్నాం. రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల ఆస్పత్రికి డాక్టర్‌ను నియమించాలి.

– సుధాకర్, రైతు, నాగారం

మృత్యువాత పడుతున్నాయి..



పశువైద్యాధికారి పోస్టును భర్తీ చేయకుండా సారపాకకు చెందిన పశువైద్యాధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంతో ఆ డాక్టర్ సక్రమంగా రావడం లేదు. దీంతో మూగజీవాలకు జబ్బు చేస్తే రైతులు అవస్థలు పడుతున్నారు. సకాలంలో వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్.పాపారావు, నాగారం

ప్రతిపాదనలు పంపించాం...



నాగారం, యానంబైల్ పశువైద్యశాలకు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో భర్తీ కోసం అనేకసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కొత్త డాక్టర్ల పోస్టు భర్తీ చేసే అవకాశం ఉంది. సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది. కొత్త డాక్టర్ నియమాకం అయ్యే వరకు ఇన్‌చార్జ్ డాక్టర్ అందుబాటులో ఉంటాడు.

– పురంధర్, జిల్లా పశువైద్యాధికారి

కేటీసీ ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఓబీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ఎల్‌ఎస్ఎన్ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని టేకులపల్లి రాజకీయ, కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ విమర్శించారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళనలో భాగంగా మంగళవారం టేకులపల్లి సీఐ టి.సురేష్‌ను కలిసి సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ... ఎల్ఎస్ఎన్ యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటోందన్నారు. వారికి రావలసిన వేతనం సకాలంలో ఇవ్వకుండా మానసిక వేదనకు గురి చేస్తున్నారని, బోనస్‌లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్యం గల కంపెనీలను గతంలో సింగరేణి యాజమాన్యం బ్లాక్ లిస్ట్‌లో పెట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్కినేని సురేందర్ రావు, డి.ప్రసాద్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, జరుపుల సుందర్, కల్తి వెంకటేశ్వర్లు, భూక్యా దళ్‌సింగ్ నాయక్, మాలోతు శివ నాయక్ పాల్గొన్నారు.

ఎరువులు 'బ్లాక్' చేస్తే కఠిన చర్యలు

ఇల్లెందురూరల్: ఎరువులు, విత్తనాల విక్రయంలో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ లాల్‌చంద్ హెచ్చరించారు. మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో మంగళవారం ఎరువులు, పురుగుమందుల విత్తన డీలర్లతో యాసంగి సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతీ డీలర్ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలని చెప్పారు. దుకాణంలో రోజువారీ స్టాక్ వివరాలు, సరుకు ధరలు విధిగా ప్రదర్శించాలన్నారు.

నకిలీ విత్తనాలు పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆఫ్ లేబుల్డ్ పెస్టిసైడ్స్ సిఫారసు చేసిన కరపత్రంలో పేర్కొన్న నిబంధనలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈఓ సతీష్, ఏఈఓలు సందీప్, యశ్వంత్, సుమన్, డీలర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దీక్ష



దీక్షలో కూర్చున్న మహిళలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి 36వ వార్డులో వాటర్‌ప్లాంట్ పనులను పూర్తి చేయాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి మంగళవారం స్థానిక మహిళలతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. వార్డులోని ప్రజలకు మినరల్ వాటర్ అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, పనులు జరగకుండా కొంతమంది అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు శుద్ధి నీటిని అందించేందుకు మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడితే కావాలనే అడ్డుకుంటున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు స్పందించి వెంటనే వాటర్‌ప్లాంట్ పనులను పూర్తి చేసి వార్డు ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. లేదంటే నిరవధిక దీక్షను చేపడతామని హెచ్చరించారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించండి..

పాల్వంచ: ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని టీవీఏసీ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ కోరారు. మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాలు అందించారు.

ధర్నాను విజయవంతం చేయాలి.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ 17వ తేదీన వరంగల్‌లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కేటీపీఎస్ టీవీఏసీ జేఏసీ కమిటీ చైర్మన్ ఎం.నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం పాల్వంచలో సంఘ కార్యాలయంలో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు.

ఆనందంలో కాంట్రాక్ట్ కార్మికులు



సంతోషం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఓబీ, కోల్ పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఎట్టకేలకు సింగరేణి ఇచ్చిన రూ.5వేల బోనస్ డబ్బులు మంగళవారం వారి ఖాతాల్లో ఎల్ఎస్ఎన్ కంపెనీ జమ చేసింది. వాస్తవానికి సింగరేణి వ్యాపితంగా అన్ని ఏరియాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు దసరాకు ముందే సింగరేణి బోనస్ (స్పెషల్ ఇన్సెంటివ్) అందజేశారు. కేవలం కేఓసీలో మాత్రమే కాంట్రాక్ట్ కార్మికులకు ఆలస్యంగా బోనస్ ఇవ్వడం గమనార్హం. కార్మికులు ఈనెల 9న వివిధ యూనియన్ నాయకుల సహకారంతో రాత్రి విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తే 10న వేతనాలు వేశారు. దసరాకు ముందే సింగరేణి యాజమాన్యం 100 మస్టర్లు ఉన్న కాంట్రాక్టు కార్మికులందరికీ రూ.5వేలు చొప్పున బోనస్ నగదుని ఎల్ఎస్ఎన్ కంపెనీకి ఇచ్చింది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు పండుగ తరువాత బోనస్ డబ్బులు ఇవ్వడం గమనార్హం. ఇదిలా ఉండగా కేటీసీలోని కాంట్రాక్ట్ సంస్థ తమ కార్మికులకు వేతనంతో పాటు పండుగ బోనస్ కూడా ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఇవ్వకపోవడం విడ్డూరం.

మండల ప్రత్యేకాధికారిగా డాక్టర్ విజయ



ఇల్లెందురూరల్: ఇల్లెందు మండల ప్రత్యేకాధికారిగా సత్యనారాయణపురం వెటర్నరీ, ఎనీ మల్ హస్బెండరీ ఏడీఏ డాక్టర్ కె.విజయను కలెక్టర్ నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో మండల ప్రత్యేకాధికారిగా ఉద్యాన శాఖ జిల్లా అధికారి సూర్యనారాయణను కలెక్టర్ ఇటీవల నియమించారు. కానీ ఆయన ఉద్యాన శాఖ పరిధిలో ఏసీబీకి పట్టుబడటంతో సస్పెండ్ అయ్యారు. దీంతో ప్రత్యామ్నాయంగా డాక్టర్ విజయను మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా నియమించారు.

త్వరలో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రకటించి వారం దాటుతుండగా, దసరా పండుగ కూడా ముగిసింది. ఈమేరకు దీపావళిలోగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమయానికి అనుగుణంగా ప్రమాణ స్వీకారం తేదీని ఖరారు చేసే అవకాశముంది. కాగా, మార్కెట్ చైర్మన్‌గా బానోతు రాంబాబుతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఇక తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ హయాంలో చైర్మన్లుగా వ్యవహరించిన భూక్యా నాగేశ్వరరావు, బానోతు హరిసింగ్‌నాయక్‌తో పాటు ప్రస్తుతం చైర్మన్‌గా నియమితులైన బానోతు రాంబాబు ముగ్గురూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం.

రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తే కేసులా?



మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: వికారాబాద్ జిల్లా దామగుండం రాడార్ స్టేషన్ ప్రారంభోత్సవం సందర్భంగా ముందస్తుగా ప్రజాసంఘాల నేతలను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఎన్డీ రాష్ట్ర నాయకుడు మధు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దామగుండం స్టేషన్ మూలంగా 12 లక్షల చెట్లున్న అటవి అంతరించిపోతుందన్నారు. దీనివల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, ఏనుగుల ప్రకాష్, జానకి, కె.సారంగపాణి, ఎట్టి నర్సింహారావు, బొగ్గారపు వెంకన్న, ఎనగంటి చిరంజీవి, వాంకుడోతు మోతీలాల్, అజ్మీరా శంకర్, లాజర్, వీరన్న, రాజేష్ పాల్గొన్నారు.

కంపెనీ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో ఆఫీసర్స్ క్లబ్, 24 ఏరియా, సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో కంపెనీ స్థాయి బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒలింపిక్ జెండాను ఎగురవేశారు. ఆరు రీజియన్ల నుంచి విచ్చేసిన క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ... సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యోగుల పని ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని వారికి మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు ఇతర కంపెనీలలో లేని విధంగా సింగరేణి క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభ చాటుకోవాలని కోరారు. విజేతలను కోల్ ఇండియా లెవల్ పోటీలకు పంపుతామని తెలిపారు. అక్కడ రాణించి సింగరేణి సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షులు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు జే.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ పార్స శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, అజయ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రమేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలి



సీఎం కప్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

జూలూరుపాడు: సీఎం కప్–2024 టార్చ్ రిలే ర్యాలీ మంగళవారం మండల కేంద్రం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో క్రీడలు, క్రీడా కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీని స్ఫూర్తిగా తీసుకొని యువత, క్రీడాకారులు సీఎం కప్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఎంపీఓ తులసీరామ్, కాంగ్రెస్ నాయకులు వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, కోటా కుమార్, బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, మాలమహానాడు మండల అధ్యక్షుడు బుడిపూడి ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్య సొసైటీపై విచారణ జరపండి..



మాట్లాడుతున్న బాలకృష్ణ

టేకులపల్లి: రోళ్లపాడు(బేతంపూడి) చెరువు గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని గ్రామానికి చెందిన బాధితుడు కొడెం బాలకృష్ణ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. 2018 నుంచి తాను మత్స్య సొసైటీ సభ్యులతో కలిసి పని చేశానని తెలిపారు. గత సంవత్సరం అధికారికంగా మత్స్య శాఖ అధికారుల పర్యవేక్షణలో తనతోపాటు మరికొందరు యువకులు చేపలు పట్టడంతో శిక్షణ పొందినట్లు చెప్పారు. అన్ని అర్హతలు ఉండటం వల్ల సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని చైర్మన్‌ను పలుమార్లు కోరినా స్పందించకపోవడంతో కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగిందన్నారు. దీంతో తనపై కక్ష కట్టి సభ్యత్వం ఇవ్వకుండా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రచారం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా సొసైటీ లెక్కలు కూడా చెప్పడం లేదని, ఎవరైనా ప్రశ్నిస్తే సొసైటీ నుంచి తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్ని అర్హతలు ఉన్న తనతో పాటు మరికొందరికి సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రస్తుత చైర్మన్‌ని తొలగించి నూతన చైర్మన్‌ని ఎన్నుకోవాలని, సొసైటీ నిర్వహణపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

జర్నలిస్టు యూనియన్ నాయకుడికి పరామర్శ



జయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాస్ తల్లి జయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయనను పలువురు మంగళవారం పరామర్శించారు. యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, నాయకులు బొల్లం శ్రీనివాస్ తదితరులు లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో శ్రీనివాస్ కుటుంబీకులను పరామర్శించి జయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ షఫీతో పాటు వట్టికొండ రవి, కృష్ణంరాజు, క్రాంతికుమార్, శివ, శంకర్, సీమకుర్తి రామకృష్ణ, సురేష్, సైదులు, మాళోతు అశోక్, శ్యామ్, పురుషత్తం, చింతల చిరంజీవి, అప్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, గాంధీపథం అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము, సభ్యులు కూడా శ్రీనివాస్‌ను పరామర్శించారు.

విద్యారంగ సమస్యలపై స్పందించాలి



సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కంపాటి పృథ్వీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన రౌండ్ సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగా విద్యారంగం విధ్వంసానికి గురైందని కేసీఆర్ అడుగు జాడల్లోనే రేవంత్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. విద్యారంగానికి సరిపడా బడ్జెట్ కేటాయించకపోవటమే కాకుండా మూడేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవటంతో చదువులకు ఆటంకం కలిగి విద్యార్థుల సర్టిఫికెట్లు ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం వద్దనే ఉండడంతో ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. స్కాలర్‌షిప్ రాకపోవటంతో రాష్ట్రంలో కొన్ని ఇంటర్ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల మూసివేయడంతో కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితికి పాలక ప్రభుత్వాలే కల్పిస్తున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా రీయింబర్స్‌మెంట్ రాక కళాశాలలు నిర్వహించలేక మూసివేసినట్లు చెప్పారు. ఆయా యాజమాన్యాలు ప్రభుత్వానికి విన్నవించుకున్నా పట్టించుకోవడంలేద విమర్శించారు. ప్రభుత్వానికి ప్రైవేట్ విద్యాసంస్థలకు మధ్య ఏర్పడిన రీయింబర్స్‌మెంట్ సమస్య కారణంగా విద్యార్థులు నలిగిపోకుండా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, సాయికుమార్, రామ్‌చరణ్, ఫహీమ్, ఉపేందర్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రతినిధులు వరలక్ష్మి, ముకుంద రెడ్డి, నరసింహారావు, బిక్కులాల్, వేణు, రవికుమార్ పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి వేతనాలు పెంచండి..



మాట్లాడుతున్న ప్రసాద్

పాల్వంచ: రాష్ట్రంలో పనిచేస్తున్న మెప్మా రిసోర్స్‌పర్సన్లకు రూ.6వేలు వేతనం ఇస్తున్నారని, కనీస వేతన చట్టం ప్రకారం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆర్పీల సమావేశాన్ని మొగిలి సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు.

డ్వాక్రా గ్రూపులు, పొదుపు, రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, బ్యాంక్ రికవరీలు, సర్వేలు వంటి అనేక విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. చాలీచాలనీ వేతనాలతో, రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తక్షణం వారికి వేతనాల పెంపుతో పాటు పీఎఫ్, బీమా, హెల్త్ కార్డు, యూనిఫాం, ఐడీ కార్డు, పెన్షన్ గ్రాట్యూటీ అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచెర్ల జమలయ్య, ఉపాధ్యక్షులు బండి నాగేశ్వరరావు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, అడుసుమిల్లి సాయిబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, కాటారపు మంజుల, స్వరూప, సామ్రాజ్యం, నాగమణి, శ్రీదేవి, రాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.